

# పరిణామం

కాలేజీ ఆవరణం అది.

"స్!" దిక్కులు చూస్తూ అన్నాడు సురేష్.

"ఈ రోజు కూడా రావట్టే గురూ!" నరేష్ గొంతు అది.

"అబ్బా! రోజా చూడకుండా వుండాలంటే ఎలాగో వుందిరా!" రమేష్ చెయ్యి చెయ్యి గుద్దుకున్నాడు.

"నా హృదయం లావణ్యా! లావణ్యా! అంటూ కొట్టుకుంటోందిరా!" సతీష్ గుండెపై చెయ్యి వేసుకున్నాడు.

"నువ్వో హార్టు స్పెషలిస్టుని కన్సల్టు చెయ్" ఉచిత సలహా పడేశాడు నరేష్.

బస్సు ఇంకా రాలేదు.

"బస్సు వచ్చినా రాకపోతే ఈ రోజు మనం ఇంకో పిట్టను వెతుక్కోవలసిందే!" రమేష్ అన్నాడు హుషారుగా.

"అదిగో భారతి!" అరిచాడు నరేష్.

"అహో! నా గుండె ఇప్పుడు 'భారతీ! భారతీ!' అంటూ కొట్టుకుంటోంది" సతీష్ అన్నాడు సంబరంగా.

ఆడపిల్లలు ఎలా చదువుతున్నది, స్వతంత్ర భారతంలో భారతిలాంటి యువతులు ఎంత ఇరుకున పడుతున్నదీ ఎవ్వరూ గమనించడం లేదు...గమనించినా గమనించనట్టే పట్టీ పట్టనట్టు వెళ్ళిపోతున్నారు.

"నాల్రోజులైంది-కళ్యాణి రావడం లేదే!" ఆరా తీశాడు సురేష్.

"కాలేజి మానేసింది."

"నీకెలా తెల్సు!"

"వాళ్ళ బంధువులబ్బాయి చెప్పాడు."

"ఎవడితోనైనా లేచిపోయిందేమోననుకున్నా."

లాంగ్ బెల్ మ్రోగింది.

అటెండెన్స్ కోసం అందరూ క్లాసు రూముల వైపు కదిలారు.

అది డిగ్రీ క్లాసు.

అందరి దృష్టి ఒక అమ్మాయి వైపు పడింది.

"కొత్తగా చేరిందేమో!"

బురఖా వేసుకుంది.

లెక్చరర్ మూర్తి వచ్చాడు.

"ఆర్ యు న్యూ అడ్మిషన్" అటెండెన్సు రిజిష్టరు తీస్తూ అన్నాడు 'బురఖా' వేసుకున్న అమ్మాయితో.

"ఆయామ్ లావణ్య సార్" బురఖా తీసేసింది.

లావణ్య అందమైన జడ లేదు. చంద్రబింబం లాంటి మొహం అమావాస్య చంద్రుడిలా నల్లగా మాడిపోయింది. బంగారు వన్నెతో మెరిసే చేతులు సగం కాలిన కట్టెలా నల్లగా వున్నాయి. "నన్ను నేను అంతం చేసుకోవాలనుకున్నా సార్...కాని విధి ఇలా మిగిల్చింది" వెనక్కు తిరిగి చూసింది.

రమేష్, సురేష్, నరేష్, సతీష్ మరికొందరు తలలు వంచుకున్నారు.

— బుధ

# నాన్న

ఏది ఏమైనా ఈ రోజు అటో-ఇటో తేల్చేయాలనుకున్నాను. సాయంత్రమయింది...

నాన్నొచ్చారు...మామూలుగా కాదు-రోజూ లాగే తప్పతాగి.

"ఈ రోజు నుంచి మీరీ యింట్లో వుండానికి వీల్లేదు" కటువుగా అన్నాను.

నా మాట విని నిర్ఘాంతపోయి గుమ్మం దగ్గరే ఆగిపోయారు నాన్న. దీనంగా చూశారు నా ముఖంలోకి.

"ఆయనెక్కడికి పోతారండీ!" అడ్డు పడింది నా భార్య.

"ఎక్కడికైనా నాకనవసరం...ఇక నా వల్లకాదు- ఇటు వీధిలోను అటు ఆఫీసులోనూ తలెత్తుకు తిరగలేక పోతున్నాను."

ఆయనకి ఏడుపొచ్చింది-ఏడ్చేశారు.

అయినా నేను పట్టు వదల్లేదు. ఆయన్ని చూస్తుంటే నా కసహ్యమేస్తుంది.

స్థిర నిర్ణయానికొచ్చినట్టు ఆయన ఓ శ్వాస వదిలి కన్నీరు తుడుచుకొని వెనుదిరిగారు.

నేను చరచరా ఇంట్లోకి నడిచాను.

గోడనున్న దేవుడి పటం మీది నుంచి జారి పడింది. అది నా తలకు తగిలి గాయమై రక్తం కారింది.

వీధిన పోతున్న ఖాళీ రిక్షానాపి అందులో నన్నెక్కించుకొని ఆసుపత్రికి తీసుకెళ్ళారు.

"డాక్టరుగారూ! నాకున్నది ఒక్కగానొక్క కొడుకండి...పుట్టిన పిల్లలంతా పురిట్లోనే పోయారు. కనీ కనీ మరిక కన్లేక వీడ్ని మాత్రం కని వీళ్ళమ్మ కన్ను మూసింది...బాబూ మీ కాళ్ళు పట్టుకుంటాను...నా బాబుని రక్షించండి... నా తండ్రిని కాపాడండి" పసి పిల్లాడ్ని చేతుల్లో పెట్టుకునేడ్చినట్టు విలవిల్లాడిపోయారు.

డాక్టరు గాయం తుడిచి దూదికింత అయోడిన్ రాసి గీసుకున్న చోట తలమీద అంటించారు.

"మరేం భయం లేదు తీసుకెళ్ళండి" అన్నారు నాన్నతో ○

—ఆప్త చైతన్య